క్లుప్తంగా

డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నియంత్రణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాళ్లు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు



మాట్లాడుతున్న టీబీ వెల్ఫేర్ అధికారి అనూరాధ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీబీ రోగులకు సోమవారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, భాగ్యలక్ష్మి ఎ-1 హాస్పిటల్ డాక్టర్ జి.ప్రమీల, అఖిల మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో 58 కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా టీబీ వెల్ఫేర్ అధికారి ఎస్.అనూరాధ, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావులు మాట్లాడుతూ మూడో విడతగా కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొంక్యాన మురళీ, రెడ్‌క్రాస్ సభ్యులు ఎం.కల్యాణ చక్రవర్తి, చిన్మయరావు, కె.సత్యనారాయణ, లావణ్య పాల్గొన్నారు.

'అభయం' చేయూత



పరికరాలు అందిస్తున్న సేవాసంఘం సభ్యులు

టెక్కలి రూరల్: టెక్కలిలోని అభయం యువజన సేవాసంఘం సభ్యులు పలువురికి సోమవారం చేయూత అందించి ఆదర్శంగా నిలిచారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో బీపీని కొలిచేందుకు వాడే స్పిగ్మోమానో మీటర్‌ను సూపరింటెండెంట్‌కి అందజేశారు. శాసనం గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని రజిత పండాకు చదువు నిమిత్తం రూ.5 వేలు అందజేసినట్లు సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా పైడితల్లి జాతర



జాతరలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

పొందూరు: పొందూరు పైడితల్లి అమ్మవారి జాతరకు రెండో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు ఏర్పాటు చేసిన లైటింగ్ భక్తులను ఆకట్టుకుంటుంది.


నాయీబ్రాహ్మణ కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: పోలవరం గ్రామానికి చెందిన తోణంగి రామారావు ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఇతనిది నిరుపేద కుటుంబం. ఈ విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు మండలం పూండి గ్రామానికి చెందిన సాయిమణికంఠ నాయీబ్రాహ్మణ సేవా సంఘం తరఫున రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపేట కృష్ణారావు, సభ్యులు సిగిరివలస అప్పారావు, ఆర్.చంద్రయ్య, ఎ.రామారావు, రాము పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి మందిర వార్షికోత్సవం



పూజల్లో సాయిభక్తులు

కాశీబుగ్గ: ఈదురాపల్లి గ్రామంలోని సత్యసాయి మందిర ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మందిర పెద్దలు, గ్రామ కమిటీ, సత్యసాయి భక్తులు పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



రణస్థలం: ఓటు వేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు





ఓటు వేసిన అంబేడ్కర్ వర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు, ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు



శ్రీకాకుళం పాతబస్టాండ్: పీఎస్ఎన్ఎం మున్సిపల్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

- బారులు తీరిన ఓటర్లు
- పక్కాగా ఏర్పాట్లు చేసిన అధికారులు



రణస్థలం: ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎస్ఎన్ స్కూల్‌లో 52, 53 పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. అంతకుముందు ఎస్పీ జి.ఆర్.రాధిక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోలింగ్ సజావుగా ముగిసింది. 70.28 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎస్సై వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. ఓటింగ్ సరళిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

లావేరు: మండలంలో 1206 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 872 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 72.30 శాతం పోలింగ్ నమోదైంది. తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు పర్యవేక్షించారు. వీఆర్‌వోలు లక్ష్మణరావు, రమేష్, గోవిందరావు, భాస్కరరావు, వీఆర్‌ఏలు సహకరించారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వైఎస్సార్ సీపీ శిబిరాన్ని సందర్శించారు.

జి.సిగడాం: మండలంలో 1254 ఓట్లకు గాను 898 పోలయ్యాయి. 71.61శాతం ఓటింగ్ నమోదైంది. రణస్థలం సీఐ ఆదాం, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎస్‌ఐ సామంతుల రామారావు పర్యవేక్షించారు.

గార: మండలంలో 1159 ఓట్లకు గాను 869 ఓట్లు పోలయ్యాయి. ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు బందోబస్తు నిర్వహించారు.

అరసవల్లి: 54వ పోలింగ్ స్టేషన్ పరిధిలో 600 ఓట్లకు గాను 412 ఓట్లు పోలయ్యాయి. డీటీ కె.నారాయణరావు, వీఆర్‌ఓ రాంజీలు పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ద్వారా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

రణస్థలం: మండలంలో 1662 ఓట్లకు గాను 1280 ఓట్లు నమోదయ్యాయి. దివ్యాంగులు, వృద్ధులు ఓట్లు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని శ్రీకాకుళం డీఎస్పీ మత్తే మహేంద్ర, తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్ పర్యవేక్షించారు.

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్‌కు సంబంధించి పీఎస్ఎన్ఎం స్కూల్ 52వ పోలింగ్‌లో బూత్‌లో 1062 ఓట్లకు గాను 709 పోలింగ్ అయ్యాయి. 53వ బూత్‌లో 1122 ఓట్లకు గాను 740 పోల య్యాయి. తహశీల్దార్ ఎస్.వెంకట్రావు పర్యవేక్షించారు.



గార: ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



జి.సిగడాం: పోలింగ్‌పై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే



లావేరులో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



జి.సిగడాం: పోలింగ్ తీరును పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్



రణస్థలం: పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర



రణస్థలం: ఓటు వేసి వస్తున్న దివ్యాంగురాలు



రణస్థలం: ఓటు వేసేందుకు వీల్ చైరులో వస్తున్న పట్టభద్రుడు



అరసవల్లి: టీపీఎం స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరం



శ్రీకాకుళం రూరల్: పోలింగ్‌ను పరిశీలిస్తున్న తహాశీల్దార్ ఎస్.వెంకటరావు



లావేరులో పోలింగ్ కేంద్రం ఓటరు స్లిప్పులు పరిశీలిస్తున్న పోలీసులు

మతి స్థిమితం లేని మహిళ మృతి

రణస్థలం: రణస్థలంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న గుర్తు తెలియని మహిళ(25) సోమవారం మృతి చెందినట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఆదివారం దన్నానపేట కూడలిలోఅవగాహన లేక కాలం చెల్లిన మందులు తినడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు వెంటనే 108లో రణస్థలం సీహెచ్‌సీ తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయినట్లు తెలిపారు. జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ హెచ్‌సీ ఎస్ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంధువులు ఎవరైనా జె.ఆర్.పురం పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అత్యుత్సాహం ఎందుకో?

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో బందోబస్తుగా ఉన్న పోలీసుల అత్యుత్సాంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్ట్స్ కళాశాల క్యాంపస్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. పోలీసులు శాంతిభద్రతల విధుల్లో ఉంటూ పహారా కాస్తున్నారు. మరోవైపు ఈనెల 15 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లలో భాగంగా.. స్ట్రాంగ్ రూమ్‌గా ఉన్న అదే కళాశాలలో విధుల నిర్వహణలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఇంటర్మీడియెట్ ప్రశ్నాపత్రాలను భద్రపరచడంతోపాటు వాటిని అత్యంత కాన్ఫిడెన్షియల్‌గా తరలింపు చేపడుతున్నారు. ఇంటర్ పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, డీఈసీ కమిటీ సభ్యులు డి.ఫల్గుణరావు తదితరులు విధినిర్వహణలో భాగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే అదే పోలింగ్ కేంద్రం విధుల్లో ఉన్న ఓ ఏఎస్సై, పలువురు కానిస్టేబుళ్లు ఇంటర్‌విద్య అధికారుల విధులకు తీవ్ర ఆటంకం కలిగించారని తెలిసింది. వారి విధులకు పదేపదే అడ్డుపడుతూ వచ్చారని సమాచారం. 144 సెక్షన్ అమల్లో ఉందంటూ ఇబ్బందులకు గురిచేసినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి అప్పటికే మైదానంలో 150 మందికిపైగా యువత, క్రీడాకారులు, మైదానంలో ఆడుతున్నారని.. వారికి వర్తింపజేయని 144 సెక్షన్ పరీక్షల విధుల్లో ఉన్న తమకు ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఇంటర్‌విద్య అధికారులు చెబుతున్నారు.

• కల్యాణం.. కమనీయం



పారాపురంలోని వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రతిష్టను ఆలయ నిర్మాణకర్త పూన్న కామయ్య దంపతులు సోమవారం నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని, కామయ్య దంపతులు, కుటుంబ సభ్యులు ఘనంగా చేపట్టారు. పారాపురం, కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. -కొత్తూరు

ముత్యాలపోలమ్మ.. చల్లగా చూడమ్మా..



పూజలందుకుంటున్న ముత్యాలపోలమ్మ

మెళియాపుట్టి: చాపరలోని గ్రామదేవత ముత్యాల పోలమ్మ ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ కలసి దీపారాధన, హోమాలు చేశారు. పోలమ్మతల్లి గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రజలు కోరుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. సంవత్సర కాలంగా పోలమ్మతల్లికి ప్రజలు అందించిన సుమారు 500 చీరలను వేలంపాట వేశారు. ఆ మొత్తాన్ని ఆలయ ఖర్చులకు ఉపయోగిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ బోసిరామారావు, గ్రామ ప్రజలు పోలినాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.



గ్రామదేవత చీరలు వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ఆరోగ్యానికి ఆసరా

- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన
- ఇంటివద్దకే వచ్చి చికిత్స అందిస్తున్న వైద్యులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రోగులు

ఎచ్చెర్ల: వయోభారంతో మంచానపడిన పండుటాకులను పరామర్శించేందుకు ఎవరైనా వస్తే చాలు ఆ వృద్ధులకు ప్రాణం లేచి వస్తుంది. పరామర్శించిన వారు తమ బంధువులైతే ఎంతగానో ఉపశమనం పొందుతారు. అయితే నేరుగా వైద్య బృందమే తరలివచ్చి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తే.. పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తే వారిలో ఆనందం వెల్లివిరుస్తుంది. ఇదే తరహాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదల బతుకుల్లో వెలుగులు నింపుతోంది. తమ ఇంటి వైద్యుడంటూ వారిలో నమ్మకాన్ని పెంచుతోంది. బాలింతలు, గర్భిణులు దూరాన ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సిన పనిలేకుండా అక్కడే వారికి తగిన వైద్యం, సలహాలు, సూచనలు అందిస్తున్నారు. మధ్యాహ్నం ఇంటింటికీ వెళ్లి మరీ రోగుల యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలను సందర్శించి పిల్లలు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలు చేపట్టడమే కాకుండా ఉచితంగా మందులు అందిస్తున్నారు. మునుపెన్నడూ ఇలాంటి ఆదరణ చూడలేదంటూ గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

4,528 మంది రోగులకు స్వాంతన

ఎచ్చెర్ల మండలంలోని ఇప్పటివరకూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా 4,528 మంది రోగులకు స్వాంతన లభించింది. గత ఏడాది అక్టోబర్ 21న కార్యక్రమ ట్రయిల్ రన్ చేపట్టారు. ఎచ్చెర్ల, పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సచివాలయాల పరిధిలో నిర్దేశిత గ్రామంలో ట్రయిల్ రన్ కొనసాగుతునే ఉంది. మండలంలోని 28 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని గ్రామాల్లో జరిగే వైద్యశిబిరాల్లో రోజుకు 70 నుంచి 100 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి.



ఇంటివద్దే వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

నెలకు సరిపడా మందులు



బీపీ, షుగర్ వైద్యపరీక్షల కోసం పొన్నాడ ఆస్పత్రికి నడిచి వెళ్లేదాన్ని. అక్కడ మాత్రలు ఇచ్చేవారు. ఈ మధ్య మా ఊరికే డాక్టర్ వచ్చారు. అన్ని పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మాత్రలు ఇచ్చారు. మాలాంటి వృద్ధులకు ఇంతకంటే ఏం కావాలి.

– క్షేత్రపల్లి సూరమ్మ, తోటపాలెం

మంచి స్పందన..



ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పేదలకు ప్రయాణ భారం లేకుండా ఇంటివద్దనే వైద్య సేవలను అందుతున్నాయి. గ్రామాల్లో మంచి గుర్తింపు వస్తోంది. ప్రభుత్వం ఆదేశాలకు మేరకు గ్రామాలు, విద్యాసంస్థల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.

– ఇప్పిలి చిట్టిబాబు, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టెంట్, తోటపాలెం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దీర్ఘకాలిక రోగులపై శ్రద్ధ



దీర్ఘకాలిక వ్యాధులతో మంచాన పడిన రోగుల ఇంటికెళ్లి సిబ్బంది పరీక్షిస్తున్నారు. ముఖ్యంగా పక్షవాతం బారిన పడిన వారు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారిని స్వయంగా కలిసి వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కిషోర్‌కుమార్, ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి